నేడు 'కొన్ని చీకట్లు..ఓ వెలుతురు'
పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కోయిల చెట్టు కథా సంపుటి రచయిత డాక్టర్ ప్రగతి రచించిన రెండవ కథల సంపుటి 'కొన్ని చీకట్లు..ఓ వెలుతురు' పుస్తకాన్ని ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఆవిష్కరించనున్నట్లు రచయిత డాక్టర్ ప్రగతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ కవి సోమచర్ల రాజారావు అధ్యక్షతన నిర్వహిస్తున్న పుస్తక పరిచయ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగివేమన విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్యులు ఎంఎం.వినోదిని హాజరు కానున్నట్లు తెలిపారు. వీరితోపాటు టి.వెంకట్‌నారాయణ, అంకే శ్రీనివాస్, పల్లవి హాజరవుతారన్నారు. కావున కవులు, కళాకారులు, సాహితీవేత్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

హామీలు అమలు చేయకుంటే... మరో ఉద్యమం..!

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల మహాధర్నా
- భారీగా తరలొచ్చిన అంగన్‌వాడీలు
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రతిపక్ష నాయకుని హోదాలో ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగన్‌వాడీలకు అనేక హామీలు ఇచ్చారని, వాటిని వెంటనే అమలు చేయాలని సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే మరోసారి ఆందోళనకు సిద్ధం అవుతామని తెలియజేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో శనవారం నాడు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ముందుగా సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నా శిబిరంలో బైటాయించారు. సమ్మెకాలపు సమస్యలు పరిష్కరించాలని, మినీ సెంటర్లను ప్రధాన సెంటర్లుగా మార్చాలంటూ మహా ధర్నాలో నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శకుంతల, రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలు 42 రోజుల రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా అప్పటి ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై అనేక హామీలు ఇచ్చిందన్నారు. సమ్మె ముగిసి ఎనిమిది నెలలు గడుస్తున్నా హామీల ఒప్పందం మేరకు ఏ ఒక్క డిమాండ్‌నూ ఇప్పటికీ పరిష్కరించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని సాకుచూపి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోవడం సరికాదన్నారు.

ధర్నాలో ప్రసంగిస్తున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రమార్

ధర్నాలో ప్రసంగిస్తున్న అంగన్‌వాడీ యూనియన్

మినీ సెంటర్ల వర్కర్లపై పని భారం మోపుతూ బానిసలుకంటే దారుణంగా పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలను నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. అంగన్వాడీలకు సంబంధంలేని యాప్ పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. నెలల తరబడి సెంటర్ అద్దెలు బకాయి ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ ఆదేశాలు ఇవ్వాలన్నారు. 42 రోజుల సమ్మె ఒప్పందాన్ని అమలు చేయాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. ఉద్యోగోన్నతులు, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె ఒప్పందం అమలుకు దశాలవారి పోరాటాలకు అంగన్వాడీలు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శకుంతల, రమాదేవి, జమున, 11 ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు రేవతి, గోవిందమ్మ, మేరీ, రమణమ్మ, శ్రీదేవి, విజయలక్ష్మి, నాగేశ్వరమ్మ, గోవిందమ్మ, ధనలక్ష్మి, సత్యవతి, రామాంజినమ్మ, పాతక్క, తిప్పిరమ్మ, విజయనిర్మల, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, ఎర్రిస్వామి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, అజంబాషా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భూఆక్రమణ నిషేధిత బిల్లుపై పునఃసమీక్షించాలి

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపొద్దు
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

భూ దురాక్రమణ నిషేధిత బిల్లు లోపభూయిష్టంగా ఉందని , దీన్ని పున:సమీక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. అనంతపురం నగరంలోని గణేనాయక్ భవనంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూ దురాక్రమణ నిషేదిత బిల్లు పేదలకు నష్టం చేకూర్చేదిగా ఉందన్నారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారమైతే పేదలు ఎక్కడైనా ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకున్నా, సాగు చేసుకుంటున్నా వారిపై ఇది బ్రహ్మాస్త్రంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలిసో తెలియకనో పేదలెవరైనా స్థలంలో ఉంటే వారికి 14 ఏళ్ల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. అదే పెద్దలు ఎవరైనా భూములు ఆక్రమించుకుంటే వారిని కాదని అందులో పనిచేసే అధికారులపై చర్యలుండే విధంగా నిబంధనలు రూపొందించారని విమర్శించారు. ఇది చాలా అన్యాయమని చెప్పారు. ఇది వరకే సూచించిన కొనేరు రంగారావు సిఫారసులను అమలు చేయలేదన్నారు. ఏ ఒక్క పెద్ద వాడిపైనా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవని విమర్శించారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలు, సాగులోనున్న నిరుపేదలను ఈ చట్టం పేరుతో దౌర్జన్యంగా ఖాళీ చేయించేందుకు అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లును చట్ట రూపంగా మార్చేందుకు ముందే అఖిలపక్ష పార్టీల అభిప్రాయాలను తీసుకుని పేదలకు నష్టం జరగకుండా మార్పులు చేయాలని సూచించారు. లేకపోతే ఇతర రాజకీయపార్టీలను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

విద్యుత్ భారాలు మోపొద్దు

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆరు వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపిందని తెలిపారు. వచ్చే నెలలో మరో పది వేల కోట్ల రూపాయలకుపైగా భారాన్ని మోపేందుకు సిద్ధమైందని, దీని అనుమతుల కోసం విద్యుత్ నియంత్రణ మండలి ముందు ఉంచడం జరిగిందని చెప్పారు. ఈ నిర్ణయం జరిగితే ఒక్కో యూనిట్‌పై రూ.2.59 పైసలు అదనపు భారం పడనుందని చెప్పారు. అంటే ఇప్పుడున్న ధరలపై మూడింతలు భారం పడనుందని వివరించారు. ఈ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి ప్రజలపై భారాన్ని మోపవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, సిపిఎం నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన పెంచాలి

రాష్ట్ర సరిహద్దులో ప్రత్యేక నిఘా : ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-ఉరవకొండ

సైబర్‌మోసాలు, రోడ్డు భద్రత, మత్తు పదార్థాల అనర్థాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. శనివారం పాల్తూరు పోలీసుస్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణపై ఆరాతీస్తూ రిసెప్షన్ సెంటర్, లాకప్ గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌కు వచ్చే పిటీషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే ప్రతీ రికార్డు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని పరిస్థితులను సిఐను అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ,మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక నిఘా వేయాలన్నారు. ఇసుక, మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్, నాటుసారా తయారీ అమ్మకం, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు గట్టిగా పని చేయాలన్నారు. బాల్య వివాహాలు,సాంఘిక దురాచారాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, ఉరవకొండ రూరల్ సిఐ చిన్నగౌస్, పాల్తూరు ఎస్ఐ మురారి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

పడిపోయిన వరిపైరు

నేలకొరిగిన వరిపంట

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని తుంగభద్ర ఆయకట్టు కింద సాగు చేసిన వరిపంట ఇటీవల కురిసిన గాలివానకు నేలకొరిగింది. మండల కేంద్రంతోపాటు దేవగిరి, ఉద్దేహాల్, శ్రీధర్‌ఘట్ట, సింగేపల్లి, గోనేహాళ్, కొళగానహళ్లి, కృష్ణాపురం, లింగదహాల్, గోవిందవాడ, కళ్లదేవనహళ్లి గ్రామాల్లో సాగు చేసిన వరిపంట పూర్తిగా నేలవాలి నాశనమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.30 నుంచి రూ.40 వేల వరకూ రైతులు పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికి వస్తుందనుకుంటున్న సమయంలో అకాల వర్షం తమను నాశనం చేసిందని రైతులు వాపోతున్నారు. వీటితోపాటు పత్తి, మిరప, మొక్కజొన్న, తదితర పంటలు కూడా నాశనమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి
ట్రేడ్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - గుంతకల్లు

దేశానికి అన్నం పెట్టే రైతుల, సంపదలు సృష్టించే కార్మికుల, ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దామని ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక బిటి పక్కీరప్ప భవనంలో వామపక్ష ట్రేడ్ యూనియన్ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కారు మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తెచ్చినప్పుడు రైతాంగ ఉద్యమం ఉవ్వెత్తున లేచిందని అన్నారు. ఉద్యమ ఒత్తిడికి తలొగ్గి ప్రధాని నరేంద్ర మోడీ రైతన్నలను క్షమాపణలు కోరి మూడు నల్ల వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నారన్నారు. మోడీ ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో కార్పొరేట్లకు 19.28 లక్షల కోట్ల రుణమాఫీ, పన్ను రాయితీ, ప్రోత్సాహకాల పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టిందన్నారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నా రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేయడంకానీ, సంపూర్ణ రుణ విముక్తి చేయడం గురించికానీ ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికే సంక్షోభంలో కూరుకుపోయిన రైతాంగంపై మరో దెబ్బ వేస్తోందన్నారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 రూపంలో విద్యుత్తును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి వ్యవసాయ మోటర్లకు, గృహ వినియోగానికి ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపునకు శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యంగా కరువు ప్రాంతమైన అనంతపురం రైతాంగం దశాబ్దాల కాలంగా వరుస కరువులతో విపరీతంగా నష్టపోతున్నారన్నారు. కార్మికుల హక్కుల కోసం స్వతంత్రానికి ముందు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా బీజేపీ ప్రభుత్వం మార్చిందన్నారు. అంగన్వాడీ, స్కీం వర్కర్లు, మధ్యాహ్నం భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై నవంబర్ 26న దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో కలెక్టరేట్ల దగ్గర ధర్నా, ర్యాలీలు నిర్వహించాలని వామపక్ష ట్రేడ్ యూనియన్లు నిర్ణయించాయన్నారు.కావున జిల్లా కేంద్రంలో జరుగు ర్యాలీ మరియు కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో రైతులు, రైతు కూలీలు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం జయప్రదం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివ రెడ్డి , ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బి. సురేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్, ఏఐటీయూసీ తలారి సురేష్, ఈశ్వరయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు రమేష్, వెంకీ, డివైఎఫ్ఐ సురేంద్ర, ఏఐటీయూసీ నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేళకు రాని ఆర్టీసీ బస్సులు

ఆందోళనలో ప్రయాణికులు, విద్యార్థులు

ప్రజాశక్తి-యల్లనూరు

తాడిపత్రి వయా యల్లనూరు నుంచి సింహాద్రిపురం వరకు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసులు సమయపాలన పాటించడం లేదని ప్రయాణికులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. తాడిపత్రి నుంచి సింహాద్రిపురానికి ఉదయం 5:15కు మొదటి బస్సు బయలుదేరాలి. అనంతరం తాడిపత్రి నుంచి యల్లనూరుకు లింక్‌బస్సు రావాలి. అయితే లింకుబస్సు వైఎల్‌ఆర్–3 సర్వీసు ఒక సింగిల్ వచ్చిన తర్వాత తాడిపత్రి నుంచి అనంతపురం రూటుకు పంపడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో పేరుకు సమయపాలన బోర్డు ఏర్పాటు చేశారు తప్ప.. వాటివేళల్లో వచ్చే సర్వీసులు మాత్రం లేవని ప్రయాణికులు వాపోతున్నారు. తద్వారా ప్రవేటు వాహనాలకు కలెక్షన్ భారీగా పెరిగిందని చెప్పవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌టిసి బస్సులను సమయానికి అనుగుణంగా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



యల్లనూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సమయపాలన బోర్డు

వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బుక్కరాయసముద్రం, పుట్లూరు, యల్లనూరు, నార్పల, గార్లదిన్నె, అనంతపురం, రాయదుర్గం మండలాల్లో వరి, జొన్న, మొక్కజొన్న, అరటి, చామంతి తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో దెబ్బతినడంతో ఆఖరికి పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. దీంతో సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారన్నారు. కావున అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. అలాగే గత ఖరీఫ్, రబీ–2023 బీమా ప్రకటించాలని డిమాండ్ చేశారు

బడ్జెట్‌లో జరిగిన మేలెంత ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఈ వారంలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందన్నది సర్వత్రా సాగుతున్న చర్చ. వర్షాభావ ప్రాంతమైన అనంతపురం జిల్లాకు అత్యంత ప్రధానమైనవి సాగు,తాగునీరు. ఈ రెండింటిని అందివ్వాలని జిల్లావాసులు ఎప్పుడూ అడుగుతూనే ఉంటారు. మానవ జీవనానికి కనీసమైన ఈ రెండింటిని అందిస్తే ఈ ప్రాంతాభివృద్ధి కొంత వరకైనా మెరుగుపడుతుందన్నది జిల్లావాసుల ఆకాంక్ష. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి జూన్‌లో వస్తే ఇప్పుడు తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇది వచ్చే మార్చి వరకు ఉండనుంది. ఈ తక్కువ కాలానికి ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే నామ మాత్రమేనని ప్రతిపక్షాలు పెదవి విరుస్తుండగా, బాగా కేటాయింపులు జరిగాయని అధికారపార్టీ భావిస్తోంది. అయితే ఇందులో కేటాయింపుల వరకు చూస్తే కొంత వరకు నిధులను హంద్రీనీవాకు కేటాయించారు. గతం కంటే కొంత మెరుగుదల కనిపిస్తోంది. రూ.1870 కోట్ల వరకు నిధులు కేటాయించారు. ఇది ప్రధాన కాలువ ఆధునీకరణకని చెబుతున్నారు. ఇందులోనూ ఇంకా పేరూరు ఎత్తిపోతలు, భైరవానితిప్ప ఎత్తిపోతల పథకాలున్నాయి. ఇవి కాకుండా సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి నియోజకవర్గంలోనూ చెరువులకు నీటిని అందించే పనులూ ఉన్నాయి. ఇవన్నీ కలిపి దాదాపు రెండు వేల కోట్ల రూపాయలకుపైగా పనులు ఉన్నాయి. ఇందులో వేటికి ఇప్పుడు ప్రాధాన్యతనిస్తారన్నది చూడాల్సి ఉంది. ఇక ప్రధానమైన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు మాత్రం నిధుల కేటాయింపులు చేయలేదు. ప్రధాన కాలువ ఆధునీకరణకు ఈ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని అందరూ ఆశించారు. కాని నిర్వహణకు కేటాయించకపోవడంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ దుస్థితి ఇప్పట్లో మారేలా కనిపించడం లేదు. ఇక తక్కిన వాటికి కూడా జిల్లాకు ప్రత్యేకమైన కేటాయింపులేవీ కనిపించలేదు. దీంతో ఎప్పటిలాగానే సాధాసీదా బడ్జెట్‌గానే ఉందన్న విమర్శలు ప్రతిపక్షాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇక ఈ వారంలో నామినేటెడ్ పదవుల భర్తీని చేపట్టింది. రెండో దఫా చేపట్టిన నామినేటెడ్ పోస్టుల్లో జిల్లాకు ఒక్క పదవి మాత్రమే వచ్చింది. అది కూడా కూటమిలోనున్న జనసేన పార్టీకి చెందిన టిసి.వరుణ్‌ను అహుడా ఛైర్మన్‌గా నియమించారు. ఆర్టీసి రీజనల్ ఛైర్మన్‌గా పూల నాగరాజుకు నియమించారు. ఇక మిగిలిన నేతలెవరికీ ఎటువంటి పదవులు దక్కకపోవడంపై తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ఎన్నికల సమయంలో టిక్కెట్లు ఇవ్వని సీనియర్ నాయకులకు కూడా ఎటువంటి పదవినీ ఇవ్వలేదు. ఇది నేతల్లో అంతృప్తిని రాజేస్తోంది. ఇక ఈ వారంలో చోటు చేసుకున్న మరో అంశం వర్షాలు. ఎప్పుడూలేని విధంగా అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా నవంబరులో వర్షాలు పడుతున్నాయి. దీని మూలంగా నూర్పిడి దశకు వచ్చిన వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతింటున్నాయి. ఇతర పంటలపైనా ఈ ప్రభావం ఉండనుందని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా పత్తి, కందిపంటలకు చీడపీడలు వ్యాపించి దిగుబడిపై ప్రభావం చూపనుంది. ఒకవైపు సీజన్ ప్రారంభం ఆగస్టులో వర్షాభావం తరువాత అక్టోబరులో అత్యధిక వర్షపాతం, ఇప్పుడు తుఫాను కలిపి అన్ని విధాలుగా రైతులకు నష్టం చేకూర్చింది.

తెల్లారితే నిశ్చితార్థం.. అంతలోనే ప్రమాదం

మృతిచెందిన గీత

గాయాలపాలైన నారాయణరెడ్డి

యువతి మృతి, సోదరుడికి గాయాలు

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్

తెల్లారితే నిశ్చితార్థం జరిగి సంతోషంగా ఉండాల్సిన ఇంట విషాదం నెలకొన్న సంఘటన మండల పరిధిలోని వెంకటరెడ్డిపల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వెంకటరెడ్డిపల్లికి చెందిన శ్రీరామ్ రెడ్డి, లక్ష్మీదేవి దంపతులకు గీత, నారాయణరెడ్డి సంతానం. కాగా కూతురు గీతకు పెళ్లిసంబంధం కుదిరింది. నిశ్చితార్థం చేసేందుకు ఆదివారం నిర్ణయించారు. అయితే నిశ్చితార్థం ఆదివారం జరగనుండగా గీత, నారాయణరెడ్డి పట్టణంలో కొన్ని వస్తువులు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అయితే ఇంటికి చేరే తరుణంలో తాడిపత్రి – బుగ్గ ప్రధాన రహదారిపై బండల లోడుతో వస్తున్న ట్రాక్టర్ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో గీత అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో నారాయణరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు గాయపడిన నారాయణరెడ్డిని అంబులెన్స్ ద్వారా స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఆదివారం శుభకార్యం జరగనున్న నేపథ్యంలో వారి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాద ఘటన తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఇ.ఇ. సతీష్‌చంద్రకు సతీవియోగం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ చంద్ర సతీమణి లక్ష్మి (43) అనారోగ్యంతో మృతిచెందారు. కడుపు నొప్పితో బాధపడుతున్న ఆమెను గురువారం హైదరాబాద్ కు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించారు. అయితే ఆపరేషన్ ముగిసిన తర్వాత ఆమె ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో శనివారం స్థానిక అరవింద నగర్‌లోని స్వగృహానికి తీసుకువచ్చారు. ఆమె మరణ వార్త తెలిసిన వెంటనే పబ్లిక్ హెల్త్ మున్సిపల్ కార్పొరేషన్ లోని ఇంజనీర్లు వివిధ విభాగాలకు చెందిన అధికారులు సతీష్‌చంద్ర స్వగృహానికి వెళ్లి భార్య పార్థివదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ మాజీ ఎస్‌ఇ నాగమోహన్, పబ్లిక్ హెల్త్ ఇఇ ఆదినారాయణ, కార్పొరేటర్ కుమారస్వామి, కృష్ణమూర్తి, జెఎన్‌టియు డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, ఎస్‌కెయు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సంజీవరాయుడు, అధ్యక్షుడు మల్లికార్జున, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి (ఇన్‌సెట్‌లో) లక్ష్మి (పాతచిత్రం)

ప్రత్యేక గుర్తింపు తెచ్చేలా భారీ విగ్రహాలు

మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చేలా పట్టణంలోని ప్రధాన రహదారుల ముఖద్వారాల వద్ద పరమశివుడు, కార్తికేయ, పచ్చదనం పరిశుభ్రత ప్రతిబింబించేలా భారీ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం పట్టణంలోని రహదారుల కూడళ్లను జెసి ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రిలో ఉన్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర ఉన్న సర్కిల్లో దాదాపు 20 అడుగుల శివుని విగ్రహం రూ.20 లక్షలతో ఏర్పాటు చేస్తామని, రాజమండ్రికి చెందిన ప్రముఖ శిల్పి నరేంద్రకు పనులు అప్పగించినట్లు తెలిపారు. అలాగే చుక్కలూరు రోడ్డు పెట్రోల్ బంక్ సర్కిల్లో రూ.16 లక్షలతో గ్రానైట్ కార్తికేయ విగ్రహం, సంధ్యా రోడ్డు సజ్జలదిన్నె పాత బ్రిడ్జి సర్కిల్లో రూ.18లక్షలతో మూడు రకాల మతాల (హిందూ, ముస్లిం, క్రైస్తవ) సింబల్స్, కడప రోడ్డులో ఐశ్వర్య విల్లా సర్కిల్లో రూ.16 లక్షలతో పచ్చదనం కనిపించే సింబల్స్, వివిధ రకాల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా పనులు విడతల వారీగా ప్రారంభమవుతాయన్నారు.

విగ్రహాల ఏర్పాటు స్థలాలను పరిశీలిస్తున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

పీస్ రేట్ అమలు చేయాలని సిఐటియు వినతి

ప్రజాశక్తి-అనంతపురం

పీస్‌రేటును అమలు చేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈమేరకు శనివారం నగరంలోని విద్యుత్‌శాఖ ఎస్‌ఇ కార్యాలయంలో ఎస్‌ఇ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టోర్‌లో పని చేసే వర్కర్లు లోడింగ్, అన్‌లోడింగ్ పనిపై ఆధారపడి 13ఏళ్ల నుంచి పని చేస్తున్నారన్నారు. ఎస్‌ఎస్‌ఆర్ రేట్లు అమలు చేయాలని టెండర్ వేసిన కాంట్రాక్టర్లను కోరగా రూ.12వేలు మాత్రమే అమలు చేస్తామని చెబుతున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా స్పందించి ఎస్‌ఎస్‌ఆర్ ప్రకారం పీస్ రేట్లు అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.వెంకటనారాయణ, ఎటిఎం నాగరాజు, స్టోర్ వర్కర్లు గంగాధర్, హాజీవలి, షామీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఇతో మాట్లాడుతున్న నాయకులు, స్టోర్ వర్కర్లు

స్టీల్‌ప్లాంట్ సాధనకు గళం విప్పాలని వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

అత్యంత వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు పార్లమెంటులో గళం వినిపించాలని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణకు స్టీల్‌ప్లాంట్ సాధన సమితి అధ్యక్షుడు బిఎం నాదల్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఎంపీని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని హీరేహాల్ మండలంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన ఇనుప ఖనిజం గనులు నీటి వనరులు, భూములు ఉన్నాయన్నారు. అంతేకాక జాతీయ రహదారి, రైలు రవాణా వ్యవస్థ కూడా ఉందన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్టీల్‌ప్లాంట్ సాధన సమితి కూటమి తరపున ప్రచారం చేసి గెలుపుకు కృషి చేసిందన్నారు. కావున స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు జిల్లాకు చెందిన ఎంపీ గళం విప్పాలని కోరారు.

ఎంపికి వినతిపత్రం అందజేస్తున్న బిఎం.నాదల్

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE ANANTAPURAMU

O.S.No. 190/2023

Between
Andhra Pragathi Grameena Bank, Venugopal Nagar Branch, Anantapuramu, Rep By Its Manager Head office Kadapa ...Plaintiff
Vs
D1 : K. Sunanda W/o Anjana Setty, D.No. 13-3-189, Sreenivasa Nagar, Anantapuramu Town
D2: K. Janardhan S/o. Chalapathi, D.No. 3-245, 4th Road Anantapuramu Town ...Defendants

NOTICE

ఇందుమూలముగా ప్రతి వాదికి తెలియజేయునది ఏమనగా పై దావాలోని వాది మీ పైన దాఖలు చేసిన దావా నిమిత్తం పై దావాను పై కోర్టులో మీపై దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తము **09-12-2024న** తేదిన వాయిదా ఉన్నది. సదరు తేది 09-12-2024న తేదిన పై కోర్టులో ఉదయం 10:30 గంటలు నుండి కోర్టు ముగియు లోపల ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని హాజరై సదరు దావాపై ఆక్షేపణ తెలియజేసుకోవచ్చును. లేని యెడల మీ పరోక్షమున పై దావా తీర్మానించబడును.

G. Ramgopal, Advocate, Aanantapuramu

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 465/2021

పందరబోయిన గంగయ్య ..వాది
వర్సస్
కె.గంగులప్ప ..ప్రతివాది

To,
ప్రతివాది చిరునామా
కె గంగులప్ప తండ్రి కె గంగన్న, వయస్సు 55 సంవత్సరాలు, హిందూ, వ్యాపారం, సూరావారి పల్లి గ్రామం,
ప్రస్తుత చిరునామా
యెల్లనూరు గ్రామం, మలకల చెరువు పోస్టు మరియు మండలం, అనంతపురం జిల్లా - 515123.

పై నెంబరు దావాలో వాది మీ నుండి దావా పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ: 21-11-2024న వాయిదా వుండినది. కావున మీరు వాయిదా రోజున ఉదయం 10-30 నిముషాలకు మీరు స్వయంగా కానీ, లేదా మీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణ లుంటే తెలుపుకోవలెను, లేనిచో మీ పరోక్షముగా సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
గిద్దలూరు
తేదీ : 15-11-2024 ఇట్లు
శ్రీ భూపని వెంకటేశ్వర్ల రావు, వాది తరపు న్యాయవాది, గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలు పెరగాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

మెరుగైన సమాజం కోసం పోలీసులు-ప్రజల మధ్య సత్సంబంధాలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. కడ్లే గౌరమ్మ జాతర పురస్కరించుకుని విడపనకల్లు మండలం పాల్తూరులో శనివారం పోలీసు-మైత్రి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామీణ కబడ్డీ పోటీలను ఎస్పీ ప్రారంభించారు. తర్వాత కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం క్రీడాకారుల్లో ఉత్తేజం నింపేందుకు ఎస్పీ స్వయంగా కబడ్డీ ఆడారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మెరుగైన సమాజం కోసం యువత మేల్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి, తల్లిదండ్రుల ఆశయాలను రెండు కళ్లుగా చేసుకుని ముందుకెళ్లాలన్నారు. ముఖ్యంగా గంజాయి, తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెడుకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడిచే యువతకు పోలీసు ఎల్లవేళలా సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, ఉరవకొండ రూరల్ సిఐ చిన్నగౌస్, సర్కిల్ ఎస్‌ఐలు మురారి, ఖాజాహుస్సేన్, నాగస్వామి, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ జగదీష్
మైత్రి సంఘం ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ జగదీష్

రాయలసీమపై 'కూటమి' వివక్ష

వైసిపి పంచాయతీ రాజ్ అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

స్వప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం రాయలసీమపై విషం చిమ్ముతోందని వైసిపి పంచాయతీ రాజ్ అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కర్నూలు నుంచి లోకాయుక్త, హెచ్‌ఆర్‌సి, ఎపిఇఆర్‌సి, వక్ఫ్ ట్రిబ్యునల్, సిబిఐ కోర్టుతో పాటు దాదాపు 43 ట్రిబ్యునళ్లను కూడా అమరావతికి తరలించడం అన్యాయమన్నారు. అభివృద్ధి కేంద్రీకరణ ఒకచోటే జరగడం వల్ల గతంలో తీవ్రంగా నష్టపోయామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వికేంద్రీకరణ లక్ష్యంగా జగన్ ప్రభుత్వం రాయలసీమ ప్రాంతానికి న్యాయ రాజధాని తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగానే కర్నూలులో జుడీషియల్ సిటీకి జగన్ ప్రభుత్వం 273 ఎకరాలు, నేషనల్ లా కళాశాలకు వందెకరాల కొనుగోలుకు రూ.వెయ్యి కోట్లు కేటాయించిందన్నారు. దాదాపు 43 ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేశారన్నారు. అలాగే కడప జిల్లా కొప్పర్తిలో ఇండస్ట్రియల్ పార్క్‌లో ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు కోసం 19.5 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో అభివద్ధి చేసేందుకు అప్పటి వైసిపి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కర్నూలు న్యాయ రాజధానిని నిర్వీర్యం చేస్తోందన్నారు. రాయలసీమ ప్రాంతం నుంచి 45 మంది కూటమి తరుపున ఎమ్మెల్యేలుగా ఎన్నికైతే వీరందరూ ధనార్జన, దౌర్జన్యాలే లక్ష్యంగా ఇసుక, మట్టి, లిక్కర్, మైనింగ్‌పై దోచుకోవడంలో ఉన్న శ్రద్ధ, ఈ ప్రాంతానికి నిధులు తేవడంలో విఫలమయ్యారన్నారు. ఈ విషయాలన్నీ విద్యార్థులు, మేధావులు, ప్రజలు గమనిస్తున్నారన్నారు. సమయం వచ్చినప్పుడు తగిన రీతిలో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

డ్వామా పీడీ సలీంబాషా

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీంబాషా సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి పనులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు ఎపిఒ విజయభారతి స్పందిస్తూ రోజువారి ఉపాధి కూలీల సంఖ్య 600 దాకా హాజరు ఉన్నట్లు వివరించారు. అలాగే రాయదుర్గం మండలంలో 75 పశువుల షెడ్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లి అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. కావున ఉపాధి హామీ పనులకు ఇంకా కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు లేనిచోట్ల ఇళ్ల వద్ద నీరు ఇంకిపోయేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. వెయ్యి ఇంకుడు గుంతలు మంజూరయ్యాయన్నారు. ఈ సమావేశంలో రాయదుర్గం ఎంపిడిఒ కొండన్న, ఎపిడి అయేషా, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతు డ్వామా పీడీ సలీంబాషా

తాగునీటికి విరాళం

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండల పరిధిలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలిసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రాయదుర్గం పట్టణానికి చెందిన వాల్మీకి పార్వతి శనివారం రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామి విజ్ఞప్తి మేరకు ట్యాంకు నిర్మాణానికి పార్వతమ్మ కుటుంబ సభ్యులు ముందుకొచ్చారన్నారు. దీంతో ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారులు సత్యనారాయణ, నరసింహులు, కార్యదర్శి గురు రాఘవేంద్ర, కమలాక్షుడు గుర్నాథ్‌రెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌కెయు ఎన్‌ఎస్‌ఎస్ బృందానికి ఎంపీ అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

ఉత్తర గుజరాత్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న ఎస్‌కెయు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శనివారం అభినందించారు. నవంబర్ 8 నుంచి 14వతేదీ వరకూ పాటన్‌లోని హేమచంద్రాచార్య ఉత్తర గుజరాత్ యూనివర్సిటీలో జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, కంటింజెంట్ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో ఐదుగురి చొప్పు బాల, బాలికలు పాల్గొన్నారు. వీరిని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అభినందించారు. అభినందించిన వారిలో ఎస్‌కెయు విసి అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్, ఎస్‌కెయు ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మురళీధర్, పిఒ శ్రీధర్, తదితరులు ఉన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని పరామర్శిస్తున్న ఎంపీ అంబికా

ఆశావర్కర్ల ధర్నాకు తరలిరండి

బొమ్మనహాల్ : ఈనెల 18వ తేదీన జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు భారీగా తరలిరావాలని సిఐటియు నాయకురాలు నాగమణి శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. గత కొన్నేళ్లుగా ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ధర్నాకు మండలం నుంచి ఆశావర్కర్లు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలివ్వాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఇఒఆర్‌డి సదాశివయ్య, సర్పంచి పార్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి బకాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ నాయకులు జయ, ఎర్రి నాగయ్య, పవన్‌కళ్యాణ్, వెంకటలక్ష్మి, లక్ష్మీదేవి, నాగేష్, ఓబులేసు, పెద్దన్న, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సిఎస్‌ఐ టౌన్ చర్చి శత వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని సిఎస్‌ఐ చర్చి శత వార్షికోత్సవ వేడుకలు శనివారం జరిగాయి. ఆలయ శత వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రెండవ రోజు జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీఠధిపతులు, రాయలసీమ అధ్యక్ష మండలం ది రైట్. రెవ. డా. పెయ్యాల ఇజక్ వరప్రసాద్, సి.డి. భారతి లు హాజరై టౌన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ప్రాంగణంలో శత వార్షిక మహోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సావనీర్ పుస్తకాలను విడుదల చేశారు. శుక్రవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఎస్తేరు నాటిక ప్రదర్శనలో విజేతలకు బహుమతులను ప్రదాన చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రెవ. జె.సాలొమన్, సి.బి. సురేంద్ర బాబు, జెజె. మనో రంజిత, జి. జేమ్స్ వరప్రసాద్,పి. ఎర్నెస్ట్ దయానంద్, కిరణ్ సుశీల్ కుమార్, మాధురి దేవి, షీబా కవిత, వినోద్ పౌల్, దివ్య తేజ, గ్రేస్ సుకీర్తి, జె.విజయ్ కుమార్, సిబిజె. రస్సెల్ కిరణ్, నీలిమ, ప్రేమ్‌కిరణ్ పాల్గొన్నారు.

సావనీర్‌ను విడుదల చేస్తున్న అతిథులు

ప్రయివేటు ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని ఆరోగ్య ప్రయివేటు ఆసుపత్రిని డిఎంహెచ్ఒ డాక్టర్ ఇబి దేవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టనంలోని ఆరోగ్య ఆసుపత్రిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సౌకర్యాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ అనుమతి లేకుండా ప్రయివేటు ఆసుపత్రులు, ప్రథమ చికిత్స కేంద్రాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పరీక్షలు నిర్వహించినా, అధిక ఫీజులు వసూలు చేసినా, అర్హతలు లేని వారు పరీక్షలు చేసినా చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు. ఈ తనిఖీలో మండల ప్రభుత్వ వైద్య అధికారి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ

కౌలు రైతులకు బ్యాంకు రుణ సదుపాయం

ప్రజాశక్తి-శింగనమల

కౌలు రైతులకు బ్యాంకు రుణం సదుపాయం కల్పించనున్నట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహారావు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో కౌలురైతులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు పత్రాలు పొందిన వారు రూ.1.60 లక్షల వరకూ ఎలాంటి సెక్యూరిటీ లేకుండా పంట రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఎఒ అన్వేష్‌కుమార్, టెక్నికల్ సునీ, కెనరా బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహారావు

కేబుల్ వైర్ చోరీకి గురైన తోటల పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని మడ్డిపల్లి, మడుగుపల్లి గ్రామాల్లో కేబుల్ వైరు చోరీకి గురైన తోటలను సిఐ సత్యబాబు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తోటల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు తోటల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అంతేగాకుండా పోలీసు సిబ్బంది రాత్రిళ్లు గస్తీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు బుక్కరాయసముద్రం విద్యార్థులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

స్కూల్‌గేమ్ ఫెడరేషన్ జాతీయ స్థాయి పోటీలకు బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-17 బేస్ బాల్‌లో పి.మోహన్, అండర్ -19 నెట్‌బాల్‌లో యు.సంధ్య, చరణ్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసుంధర తెలిపారు. అలాగే అండర్-14 నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో జిల్లాజట్టు తృతీయ స్థానం సాధించగా పాఠశాలకు చెందిన ధరణి ధ్రువన్, గౌతమ్ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అలాగే అండర్-14 బాస్కెట్‌బాల్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించగా పాఠశాలకు చెందిన విద్యార్థులు రాజు, గణేష్ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఆయా విద్యార్థులను పీడీలు గోపాల్‌రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయులు నాగరాజుగౌడ్, దివాకర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, ఆనంద్, తదితరులు అభినందించారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

యల్లనూరులో కార్డెన్‌సెర్చ్

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలో సిఐ పి.సత్యబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శనివారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం పలు గొడవల్లో ఉన్నవారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీరామప్రసాద్, యల్లనూరు, పుట్లూరు పోలీసులు పాల్గొన్నారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఎన్‌పిసిఐ తప్పనిసరి

ప్రజాశక్తి-యల్లనూరు

మండల వ్యాప్తంగా ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ఎన్‌పిసిఐ తప్పకుండా చేయించుకోవాలని ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి తెలిపారు. శనివారం సచివాలయ సిబ్బంది తో ఏర్పాటు చేసిన టిఎల్‌సి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ తప్పనిసరిగా ఉదయం 10:30గంటలకు విధులకు హాజరు కావాలన్నారు. వచ్చిన వెంటనే అటెండెన్స్, రిజిస్టర్ రికార్డ్‌ను నమోదు ప్రక్రియను కొనసాగించాలన్నారు. సమయపాలన పాటిస్తే ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేసుకుంటారన్నారు. ముఖ్యంగా జియో టాగింగ్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రజలకు తమ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పిసిఐ చేయించుకునేందుకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, డిడిఒలు, తదితరులు పాల్గొన్నారు.

కాంటినెంటల్ కాఫీ పరిశ్రమను సందర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం రూరల్ : విజయవాడలోని కాంటినెంటల్ పరిశ్రమను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం సందర్శించారు. కాంటినెంటల్ యాజమాన్యం ఆహ్వానం మేరకు దుగ్గిరాలలోని పరిశ్రమను సందర్శించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాంటినెంటల్ కాఫీ రాష్ట్రంలోనే ఒక బ్రాండ్‌గా మారిపోయిందన్నారు. అనంతపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందు రావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని ఎస్‌కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు నందు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మాకంగా ప్రభుత్వ పాఠశాలలో డొక్కా సీతమ్మ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కావున విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనాన్ని మెనూప్రకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సతీష్, అసీఫ్, చిరు, చిన్న పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తింటున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

ఇటీవల కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. ఈమేరకు శనివారం ఫోన్ ద్వారా నియోజకవర్గంలోని తహశీల్దార్లు, వ్యవసాయ అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా వర్షం కారణంగా జరిగిన పంట నష్టం, తడిసిన ధాన్యం, వంగిన పంట వంగడాలు, తదితర వివరాలను అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. పంట నష్టం అంచనా వేసి నివేదికలు పంపాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తప్పకుండా ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తెలిపారు.

నారా రామ్మూర్తినాయుడు మృతికి సంతాపం

రాయదుర్గం : సిఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రామ్మూర్తి నాయుడు మృతి నారా కుటుంబానికి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనను కోల్పోయిన బాధ నుంచి వారి కుటుంబం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అనంతపురం రూరల్ : సిఎం చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతి పట్ల ఎమ్మెల్యే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి బాధాకరమన్నారు. రామ్మూర్తినాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

పంటలకు బీమా చేసుకోండి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులు తప్పనిసరిగా బీమా చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సరిత సూచించారు. శనివారం మండలంలోని తీటకల్లులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటను వ్యవసాయ శాఖ అధికారిణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి బీమా తీసుకోవాలన్నారు. డిసెంబర్ 15వతేదీలోపు రైతులు బీమా చెల్లించాలన్నారు. లేకుంటే పంట నష్టపరిహారం వర్తించదన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-యాడికి

మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు శనివారం ఆకస్మింగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పిల్లలకు వ్యాక్సినేషన్‌తోపాటు ఆహారాన్ని పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన బాలింతలు, గర్భిణులు వ్యక్తిగత పరిశుభ్రత, డ్రైడే ఫ్రైడే పాటించాలన్నారు. అనంతరం పిహెచ్‌సిలోని ల్యాబ్ రికార్డులు పరీక్షించి ల్యాబ్ టెక్నీషియన్‌కు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ సుమతి, ఏఎన్ఎం సబితా, ఆశా కార్యకర్త రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

కోటి దీపాలంకరణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం చేపట్టనున్న కోటి దీపాలంకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రెవెన్యూ డివిజనల్ అధికారి కేశవనాయుడు శనివారం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్యక్రమాలు, వాహనాల పార్కింగ్, భక్తులు దీపాలు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు, వైద్యసేవలు, తదితర కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ సుమన జయంతి, ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహ, తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఏఎస్ఐ దస్తగిరి, సర్పంచి ఎర్రిస్వామి, ఆలయ ఇఒ బాబు, అర్చకులు సీతారామస్వామి, ఇఒఆర్‌డిలు కామాక్షి ఆనంద్, శైలజారాణి, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, రామాంజనేయులు, వలి, సాంబ, మల్లేష్, శిరీషా, మూకాంబిక, తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

గొర్రెల కాపరులపై దాడి

గార్లదిన్నె : గొర్రెల కాపరులపై ట్రాక్టర్ నగర్‌కు చెందిన సిబ్బంది దాడులు చేస్తున్నట్లు గొర్రెల కాపరి నగేష్ వాపోయాడు. శనివారం గార్లదిన్నె మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు మాట్లాడుతూ తాను గొర్రెలు మేపుతుండగా ట్రాక్టర్ నగర్ చెందిన సిబ్బంది విచక్షణారహితంగా దాడి చేసి బూతులు తిడుతూ, కాళ్లతో తొక్కి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశాడు. నుదుటిపై తీవ్రగాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. ట్రాక్టర్ నగర్‌కు సంబంధం లేని భూముల్లో గొర్రెలు మేపుతుంటే దాడి చేశారని వాపోయాడు. దాదాపు మూడు నెలలుగా గొర్రెల కాపరులపై దాడులు చేస్తున్నారన్నారు. దీనిపై విచారణ చేసి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎఐ పెన్నయ్య

రైతు కుటుంబానికి పరామర్శ

ఉరవకొండ : ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని విడపనకల్ మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య పరామర్శించారు. మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామానికి చెందిన జొన్నగిరి మధుసూదన్ కుమారుడు అంజినయ్య (43) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రైతు మృతిపై ఆరాతీశారు. అంజినయ్యకు 12.71 ఎకరాల భూమి ఉండగా రెండేళ్ల నుంచి పంటలు సాగు చేసి దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.4.5లక్షలు అప్పులు చేశాడన్నారు. దీంతో దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులను వివరించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ హరికిషోర్, ఎంపిఇఒ అబ్దుల్ కరీం, విజయ్‌కుమార్, లక్ష్మీరెడ్డి, వలిసాబ్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

రేపటి నుంచి 'ఆధార్' శిబిరాలు

పుట్లూరు : మండలంలో సోమవారం నుంచి ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ అలివేలమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకూ కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పుట్లూరులోని ఆదర్శ పాఠశాలలో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హోటళ్లలో తనిఖీ

అనంతపురం : విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు నగరంలోని బేకరీలు, హోటళ్లలో శనివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పరిశుభ్రముగా లేకపోవడం, నాణ్యతలో లోపాలు, నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న వ్యాపారులకు రూ.90వేలు అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో సిఐ శ్రీనివాసులు, ఏవో వాసుప్రకాష్, డిసిటిఒ విజయలక్ష్మి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, వెంకటరమణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

వేరుశనగ కోసం నమోదు చేసుకోండి

బెలుగుప్ప : మండలంలోని బోరుబావుల కింద సాగు చేసేందుకు వేరుశనగ విత్తనకాయలు కావాల్సిన రైతులు ఆయా రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందుకోసం మండలానికి 300 క్వింటాళ్ల విత్తన కాయలను అధికారులు కేటాయించినట్లు తెలిపారు. కావాల్సిన వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పశువైద్యశాల తనిఖీ

కళ్యాణదుర్గం రూరల్ : మండల పరిధిలోని పాలవాయి పశువైద్యశాలతోపాటు తిమ్మసముద్రం, కొత్తూరు రైతు సేవాకేంద్రాలను పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు రామ్మూర్తి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాలవాయిలో చేపట్టిన పశుగణన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాలవై పశువైద్యశాల వైద్యులు మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురంలో నిర్వహించిన వారోత్సవాల్లో గ్రంథాలయ కార్యదర్శి రమా

ఉరవకొండలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న వారోత్సవాలు శనివారం 3వరోజుకు చేరుకున్నాయి. ముందుగా గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న ప్రముఖుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి కార్యదర్శి పి.రమ హాజరై విద్యార్థులకు పలుపోటీలు నిర్వహించారు. సీనియర్ విభాగంలో 8, 9, 10వ తరగతులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా జివి.రమణ, విశ్రాంతి హెడ్మాస్టర్, షేక్ కంబదూర్ నబీరసూల్, పి.శ్రీరాములు, రిటైర్డ్ టీచర్ జి.మధు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ కిరణ్‌కుమార్, రిటైర్డ్ లెక్చరర్ ధర్మవరం డాక్టర్ రమేష్ నారాయణ, ఆర్‌టిఐ ఛైర్మన్ వన్నూరప్ప, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : గ్రంథాలయ ఉద్యమకారుల స్ఫూర్తి ఎన్నటికీ మరువరానిదని తెలుగు ఉపాధ్యాయుడు రవికుమార్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకట రమణయ్య, డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎర్రిస్వామి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రవితేజ, విద్యార్థులు, పాఠకులు బసవరాజు, ఆనంద్, మహేష్, ప్రకాష్, కెంచప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి హెచ్. శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉద్యమకారులక చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజుల, హెచ్.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు అనూరాధ, సౌందర్య, గ్రంథాలయ సిబ్బంది ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

నార్పల : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి జీవన, కెఎల్ఎన్.ప్రసాద్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాప్తాడు : గ్రంథాలయ అధికారి వి.వీరనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయోద్యమకారులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మయ్య, స్కూల్ అసిస్టెంట్, విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

నార్పలలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

బ్రహ్మసముద్రం మండలంలో మాట్లాడుతున్న వక్తలు

కళ్యాణదుర్గంలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళు లర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

ఇంటింటా జియో ట్యాగింగ్ సర్వే

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని పలుగ్రామాల్లో శనివారం జియో ట్యాగింగ్ సర్వే కొనసాగింది. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి హౌస్‌ని క్యాప్చర్ చేసి ఇంట్లోని వ్యక్తితో వేలి ముద్ర తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి 21 వేల గృహాలను జియో ట్యాగ్ చేసినట్లు తెలిపారు. మండలంలోని బ్యాంకు ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలు నిలిచిపోయిన, ఆధార్ లింకు చేయించని 5,800 వేల మంది వెంటనే బ్యాంకులను సంప్రదించాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ప్రజాశక్తి-యాడికి

మండలంలోని ఎరువుల దుకాణాలను తాడిపత్రి సహాయ వ్యవసాయ సంచాలకులు చెంగల్‌రాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా దుకాణాల్లో లైసెన్సులు, స్టాకు వివరాలు, ప్రభుత్వంతో అనుమతి తీసుకున్న కంపెనీల ద్వారా ఎరువుల కొనుగోలు జరుగుతున్నాయా.. లేదా.. అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దుకాణంలో ఏం తీసుకున్నా తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు

పామిడి : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మహిళా న్యాయ విజ్ఞాన్ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి కాశీవిశ్వనాథ ఆచారి, రాష్ట్ర మహిళా కమిషనర్ రుకియా బేగం, తదితరులు మహిళలకు ప్రభుత్వం న్యాయ సలహాలు, బాల్య వివాహాలు, గృహహింస వంటి వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ డిల్లేశ్వరి, ఎంపిడిఒ తేజోష్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఐకెపి లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని వ్యక్తిత్వ వికాస నిపుణులు విజయ్‌కుమార్ సూచించారు. శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ బాలుర ఐటిఐలో 'డ్రగ్ అడిక్షన్ కంట్రోల్'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడి చాలామంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కావున విద్యార్థులు మంచి అలవాట్లతో మంచి సమాజం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు విజయ్‌కుమార్

చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గుత్తి

చట్టాలు, హక్కులపై దళిత,గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సిఐ బి.వెంకటేశ్వర్లు, సాంఘిక సంక్షేమ సహాయ అధికారిణి బి.రాధిక సూచించారు. శనివారం పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో సిఐడి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండి ఇతరులకు తెలియజేయాలన్నారు. అనంతరం ఆర్‌డిఒ శ్రీనివాసులును పలువురు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా, మండల విద్యాధికారి బి.రవి నాయక్, శ్రీ సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లు రెడ్డి, టిడిపి ఎస్టీ సెల్ నాయకుడు కోనేటి గోవిందు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.